# పీడిస్తున్న సమస్య

ఎటో అర్థంలేకుండా అడుగులు వేస్తూ పోతూన్న రామేశాన్ని ఆపి "జట్కా కావాలేటి బాబయ్యా?" అన్నాడు-చేత్తో, కొరడాపట్టుకొని ఓ అస్థిపంజరములాంటి మనిషి. 'ఊఁ' అని ఏదో పరాకులో అన్నాడు రామేశం. వాడు తీరా జట్కా తీసుకొచ్చి "ఎక్కడికి బాబయ్యా?" అని రెండుమూడుసార్లు అడిగేసరికి వాస్తవిక జగత్తులోకి వచ్చి, "ఇప్పుడీ జట్కా యెందుకూ?" అన్నాడు వాడి వేపు తెల్లబోయి చూస్తూ!...

"మీరేకదూ తెమ్మన్నారు." అన్నాడు మనస్సులోంచి, బయటకు ఉబుకుతూన్న కోపాన్ని అణచుకుంటూ జట్కావాడు.

ఆ జట్కా యెక్కి యెక్కడికి వెళ్లాలో అర్థమైందికాదు రామేశానికి! ఓగమ్యస్థానంఅంటూ ఉంటేకదూ, తను జట్కా యెక్కి వెళ్ళడానికి? తీరాజట్కా, తన కక్కర్లేదని చెప్పేస్తే పాపం ఆజట్కావా డెంత యేడుస్తాడో తన మీద?...

కానీ, వాడినూరికే పంపించేయడం ఇష్టంలేక పోయిందతనికి. జట్కా యెక్కి కూర్చున్నాడు.

"ఊరవతలనున్న బయిలుసాగరం దగ్గరకుపోనీ" అన్నాడు ఓగమ్యస్థానాన్ని కల్పించుకొని!—అక్కడితో

మాత్రం తనప్రయాణం అంతమవుతుందా? ఉహుఁ-ఎంత వరకూ తను ప్రయాణం చేయవలసుందో తనకే తెలీదు...

ఆరోజున అంతవరకూ ఒక్క బేరం తగలక ఆఖరికెలాగైతేనేం, గుఱ్ఱం దాణాకైనా సరిపోయే డబ్బులొస్తున్నాయికదా అన్న ఆనందంతో కమ్చీ ఝుళిపించాడు జట్కావాడు. అంతవరకూ పరాకుగా ఉన్న గుర్రం త్రుళ్ళిపడి ముందుకి అడుగులేసింది!

జట్కా అంతటినీ పరిశీలించి చూసేడు రామేశం. జట్కావాడిని మరోమారు చూసేడు. వాడెంత యెండుగా అస్థిపంజరంలా ఉన్నాడో అలానే జట్కాకూడా పాడుపడి శిథిలావస్థకు సమీపంలోనే వుంది. ప్రక్కనున్న, సందుల్లోంచి క్రిందికి చూసేడు. గిరగిరా తిరుగుతున్నది చక్రం!... పరిశీలనా దృష్టితో మళ్ళీచూసేడు చక్రం వేపు, చక్రాలు తిప్పితే తిరుగుతాయి!—భూమికూడా తిరుగుతున్నది—ఇంకా యింకా తిరిగేవాటినిగురించి ఆలోచిద్దామనుకున్నాడు. కానీ ఎంచేతో తన తలకూడా తిరిగినట్టయింది. కాస్త మతి తప్పినట్టయి అలానే జట్కాబల్లకు చేరబడి కళ్ళు మూసుకున్నాడు.

మొదట రెండెడ్ల బండిమీద- తరువాత బస్సులో- రైలులో- తరువాత నడక- మళ్ళీజట్కామీద!- ఏమిటీ ప్రయాణం? ఎక్కడికీ ప్రయాణం? అని అతనిమనస్సులో ఏవేవో ప్రశ్నలు!-

ఎక్కడికేమిటి?...విసుగెత్తి, చికాకెత్తి ఆఖరికి అసహ్యం పుట్టిన సంసారసాగరంనుంచి బయటపడేందుకు!...

కానీ, ఆ సాగరంనుంచి బయటపడవలసేటంతటి ఆవశ్యక తేఁవిటి? అందులో ఆనందంలేదా?...అందులో శాంతిలేదా? మానవులందరూ ఇలానే అనుకొని సంసారాలను త్యజించి సన్యాసులయి కూర్చుంటే, ఈసృష్టంతా ఎందుకు? ఇంతకీ తను అలా కుటుంబాన్ని విడిచి వెళ్ళిరావడం ఏమంత మంచిపనేనా? తనభార్య ప్రవర్తన మంచిది కాదనీ, స్కూళ్ళఇన్‌స్పెక్టరువలలో పడిందని లోకులుఅంటే నమ్మి దానిని హింసించి, తను యిలా వచ్చేయడం సబబైనపనేనా?...ఆ విషయాలనుగురించిబాగాఆలోచిద్దామనుకున్నాడు.—

కానీ, అంతవరకూ జోరుగా ముందుకు నడచిన బండీ, ఒక్కమారుగా వెనక్కిలాగబడినట్టయింది!... ముందుకి తూలి జట్కామీద వాలిపడ్డాడు రామేశం. కళ్ళుతెరచి చూసేసరికి రామేశం గుర్తించిన విషయం యేఁవిటీ అంటే అంతవరకూ మంచి హుషారుగా పరిగెత్తిన గుర్రం యీండ్రబడుతూ వెనక్కి అడుగులు వెయ్యడం మొదలెట్టింది. జట్కావాడు క్రిందికిదిగి గుర్రాన్ని గట్టిగాపట్టుకొని కమ్చీతో కొట్టడం మొదలెట్టాడు. ముందుకి నడుస్తేనా?...ఊహుఁ!- ఉన్నచోటనే వుండి వెనక్కి కాళ్ళెగరేస్తూ యీండ్రబడడం మొదలెట్టింది!

“ఏమిటోయ్!... ఇది యేకాలవలోనైనా తోసేసేలావుందే?” అన్నాడు రామేశం సుళువుగా దిగిపోయేందుకు వీలుగాఉంటే పొజిషన్‌లో వుండి.

“ఫరవాలేదు బాబూ. మీరలానే కూర్చోండి. ఇంకా

కొత్తగుర్రం ఎంతసేపూ యింటికాసి తనుపే!...ఊరుదాట్టా నికి జంకుద్ది!" అన్నాడు కళ్ళెంపట్టుకొని గుర్రాన్ని ముందుకి లాగుతూ.

"కళ్లెం చేతిలో వుండగానే ఎంతహంగామా చేస్తున్నదో చూడు!" అన్నాడు రామేశం ఆశ్చర్యంతో.

"గుణ్ణం మంచిది కాకుంటే కళ్ళెం గట్టిగా పట్టుకుంటే మాత్రం ఏటిలాభం బాబయ్యా! మనం ఎంతజాగ్రత్తగా ఉన్నా పక్కపక్కలదార్లకు లాగేసి మనల్ని తిరగేసేస్తుంది!" అన్నాడు జట్కావాడు; గుర్రం కొంచెం సాధుత్వంలోకి వచ్చినందుకు సంతోషిస్తూ.

"సరే కొంచెం నడుస్తున్నదికదా, ఇక యెక్కు. ఔను గానీ, ఇది యింత పెంకిగుర్రంకదా, దీన్ని అమ్మేసి క్రొత్త దాన్ని కొనగూడదూ?" అన్నాడు రామేశం.

"ఎన్నిటి ననగ కొనేది బాబయ్యా?.. అదీ యిలాగే ఉంటేనే!...ఏదోపాతబడితే యిదే దార్లోకొస్తుంది..." అని వాడంటూ వుండగానే ప్రక్కనున్న కాలువలోకి బండిని లాగేసింది.

నయం!...ఏ ఒక్కరికీ ప్రమాదం రాలేదు. ఇంకొంచెం లోపలికి లాగిందంటే బండితప్పక బోల్తా కొట్టవలసిందే!...

"బాబూ, ఆ యెదురుగా అగుపిస్తున్నదే 'బయిలు సాగరం!... మరి ముందుకు నడిచేటట్టు లేదు బాబయ్యా. ఏదో పేదోణ్ని..." అన్నాడు అమాయకంగా.

ఓ అర్ధరూపాయి తీసి యిచ్చేడు. ఆ ఒక్క ఫర్లాంగు దూరంకోసం వాడితో తగాదా ఆడి డబ్బు తగ్గించేయడం

అతనికేమంత యిష్టంలేదు...ఇంతకీ తను తప్పక అక్క డికే వెళ్ళాలన్న నిశ్చయం ఏమిటి? ... ఊరికినే వాడికి డబ్బు యిచ్చేసేకన్నా కాస్త దూరంవచ్చి యిచ్చేద్దా మని!—

కానీ ఆ గుర్రం వైఖరి చూస్తే ఆశ్చర్యంవేసింది రామేశానికి!... రోజూ తిండిపెడుతూ పెంచుతున్న యజ మాని గౌరవం దక్కించింది కాదే! కళ్ళెన్నికూడా ఆఖరికి తెంపుకొని పారిపోదామని ప్రయత్నించిందే!... అది ఎంత సేపూ వెనక్కి, పక్కలకీ దృష్టిని మళ్ళించి చిందులు త్రొక్కుతూఉంటే, పాపం వాడెలా బండిని తోలగలడు?...

...ప్రపంచంలో ప్రతీవిషయం ఇంతే కాబోలు!... ముఖ్యంగా తన విషయం! తను నానా శ్రమలూ పడి డబ్బు సంపాదించి యింట్లో కూరొ్చపెట్టి మేపుతూవుంటే బుద్ధి లేదూ ఆ లక్ష్మికి!... పెరటివార్లూ, ప్రక్కదార్లూనా?... ఊళ్లో యింతో అంతో గౌరవంగా బ్రతుకుతున్న తన గౌర వాన్ని బూడిదలో కలిపేసిందే! తను పెళ్ళినాడు ఆమెమెళ్లో మూడుముళ్ళు వేసి తాడుకట్టినమాట వాస్తవం!... కాని ఆ బంధాలనే సడలించి పారిపోవాలని ప్రయత్నించుతున్న ట్టుందే!— ఇలా ఉంటూవుంటే తనెలా సంసారాన్ని గడప గలడు?...

కానీ మరోసమస్య అతని హృదయాన్ని తాకింది!... కేవలం తన యజమానికి అపకారం చెయ్యాలన్న ఉద్దేశం తోనే ఆ గుర్రం అలా ప్రవర్తించిందా— లేక ఊరుదాటితే ఏం ప్రమాదం తన యజమానికి వాటిల్లుతుందోననే భయం

చేత ఆరకంగా వెనక్కి అడుగులేసిందా...? ఆ జట్కా వాడు ఆ గుర్రం మనస్తత్వాన్ని అర్థంచేసుకోబట్టే దాని బాహ్యప్రవర్తనలో చెడుగునట్టు కనిపిస్తున్నప్పటికీ ఓపికతో సహించి దాంతో కాలక్షేపం చేస్తున్నాడు—

ఏదో లోకం అరుపులు విని, భార్యను అనుమానించి, దాన్ని విడిచి వచ్చేయడం సబబైన పనేనా?... మరి, ఇనస్పెక్టరు యింటికి వెళ్ళినట్టు ఆమే ఒప్పుకుంటున్నదే!... అయితే బాహ్యదృష్టిలో ఆపని లోకానికి చెడ్డగా కనిపించడం సహజం!... కానీ, తన మేష్టరుపని పోకుండా కాపాడేటందుకే ఇనస్పెక్టరుదగ్గరకెళ్ళడం తటస్థించిందనీ, అంతేగాని దురుద్దేశంతో వెళ్ళలేదనీ ఆమె యేడుస్తూ తనతో అన్నమాటల్లో ఎంతవరకూ నిజముంది?... ఆవిషయాల గురించి 'బయలు సాగరం'లో కూర్చొని బాగా ఆలోచిద్దామనుకున్నాడు.

కళ్ళెత్తి బైలుసాగరంవేపు చూసేడు. కొందరు కుర్రాళ్ళు ఓ ప్రక్కని ఫుట్‌బాల్ ఆడుతున్నారు. మరికొందరు మరోప్రక్క హాకీ ఆడుతున్నారు. మరి కొందరు చిన్నపిల్లలు గడ్డిలో పిల్లి మొగ్గ లేస్తున్నారు. మరి కొందరు మరోపక్క గాలిపటా లెగరేస్తూ పందేలు వేస్తున్నారు.

అదివరకు కొన్ని సంవత్సరాలక్రిందట అదొక పెద్ద చెరువు. అది క్రమేణా పూడిపోయి విశాలమైన మైదానంగా తయారైంది. సాయంత్రం వేళ షికారుకని ఆ ఊరివాళ్ళు అక్కడకు చేరుతూవుంటారు.

*        *        *

అలా మెల్లగా నడుస్తూ గాలిపటా లెగరేస్తూన్న వాళ్ళ ప్రక్కకొచ్చి నిలబడ్డాడు రామేశం. సరదాకొద్దీ ఓ వ్యక్తి గాలిపటం ఎగురవేస్తూ, ఓ చిన్న కాగితం ముక్కకి మధ్య నొక కన్నంపొడిచి, ఆకన్నంలోంచి దారాన్ని దూర్చి వదులుతున్నాడు—ఆ కాగితం గాలి ఒత్తిడి శక్తివల్ల 'జర్' మని ఆ దారాన్ని అనుకొని మీదికి పోతుంటే ప్రక్కనున్న కుర్రాళ్ళతో "చూడండర్రా ఆకాశంమీద డాన్సుచేస్తున్న మా ఆవిడకు ఎలా ఉత్తరం పంపిస్తున్నానో!" అని అంటూ, మరికొన్ని కాగితాలకు కన్నాలు చెయ్యమని ప్రక్కనున్న కుర్రాళ్ళకి చెబుతున్నాడా వ్యక్తి.

అతను అలా ఆనందంగా పటం ఎగురవేసుకోడం యిష్టంలేకపోయింది కాబోలు కొందరికి!... అతనికీ, ఆ పటానికీ మధ్యనున్న సంబంధాన్ని త్రెంచుదామని బుద్ధి పుట్టింది కాబోలు!... గాజుపెంకుల పొడితోనూ, జిగురు తోనూ బలంగా పేనిన దారంగల పటంతో మరో ట్రూపు వచ్చి, తమ దారంతో ఆ దారం మెలిపడేటట్లు చేసి, రాపిడి వల్ల ఆ దారం తెగిపోయినట్టు చేసేరు.

ఆ వ్యక్తి తెల్లబోయి, బిగువు తప్పి వ్రేలబడిపోయిన దారంవేపూ, తన చెప్పుచేతల్లో అంతవరకూ వుండి మరో పక్క ఎక్కడెక్కడికోపోతూ తనకు దూరమైపోతున్న పటంవేపూ, "మేమేం సామాన్యుల మనుకున్నావేంటి?" అన్నట్టు తన పటానికీ మధ్యగల దారాన్ని తెంపి, పైగా తననిచూసి నవ్వుతూన్న, ఆ మూర్ఖపు ముఠా వేపూ, పటం ఎక్కడపడుతుందో పట్టుకుందామని పరిగెడుతున్న మరి

కొందరి స్వార్థపరుల వేపు నిరీహనేత్రాలతో చూస్తూ ఒక్కక్షణం సేపు విస్తుపోయాడు ఆ వ్యక్తి. మళ్ళీ యేం ఆలోచన తట్టిందో ఒక్క ఊపున లేచి పటంపోతున్న దిక్కు వేపు పరిగెత్తడం మొదలెట్టేడు.

ఆ సంఘటననంతటినీ మొదట్నించీ చూస్తూ విస్తుపోయాడు రామేశం! మరి అక్కడి విషయాలను వేటినీ చూడలేక బలవంతాన కళ్ళు మూసుకున్నాడు. ప్రపంచంలో మూర్ఖులసంఖ్య హెచ్చనుకున్నాడు. అతనేం వాళ్ళతో పందేనికొచ్చాడా? అతనేదో సరదాకోసం పటం ఎగరవేసుకుంటూ ఆనందిస్తూవుంటే, అతని ఆనందాన్ని పాడుచేసి, ఆ పటానికీ అతనికీ మధ్యగల సంబంధాన్ని త్రెంచి పైగా అతని వేపు చూసి నవ్వడంకూడానా?... ఏం లోకం!— ఈ లోకంలో ఒకరి విచారం ఇంకొకరి ఆనందం కాబోలు! అనుకుంటూ ఓ వేడి నిట్టూర్పు విడిచేడు రామేశం.

కానీ ఆ వేడి నిట్టూర్పుగాడ్పు మళ్ళీ అతని హృదయాన్నే తాకింది. ఒక్కమారు చలించిం దతని హృదయం! ...మనస్సులో ఏవేవో అనుమానాలు!-జట్కాబండీ, గాలిపటం-మళ్ళీ మనస్సులో మానసిక బింబాలయేయి-బహుశా తన జీవితానికీ ఆ సంఘటనలకూ ఏమైనా సంబంధం వుందా?...

...తనకు తన భార్యమీద బాగా అనుమానం కలిగింప జేసినది లోకం కదూ?...తను, తనభార్య చెప్పిన సంజాయిషీ నెంచేత నమ్మకూడదు? అక్కడికి లోకమేనా మహానీతి, న్యాయం గలది?...

ఇంతకీ ఈ విచిత్రసంఘటన రావడానికి కారణం తను ఓ స్కూలుమాస్టరయి ఉండడమే అనుకున్నాడు. లేకపోతే ఆ స్కూళ్ళ యిన్స్పెక్టరు తనమీద యెందుకలా హుకూం చెలాయిస్తాడు? తనింట్లో భోంచేసి, తనభార్య నెలా చూడగలుగుతాడు?...

సరే, తనింట్లో భోంచేసి, తనభార్యనిచూసినా భయం లేదు, ఏమంతబాధా లేదు! భోంచేస్తున్నప్పుడు ఆ పేలావనేం? "స్కూలు వర్కేమీ బాగులేదండీ!...నేను ఖచ్చితమైన మనిషినని మీకు తెలిసుంటుంది. రికార్డులవిషయంలో కొన్నిలోపా లున్నాయి!...అంచేత మీ ఉద్యోగానికే భంగం కలగొచ్చు" అని- తనభార్య విని బ్రతిమాలుకోవాలని కదూ ఆ "మాయలమారి ముండెమ్మ" ఉద్దేశ్యం?... సాలీడువల కాకపోతే మరేమిటది?

వాడనుకున్నట్లూ, వేసినవలలో పడింది లక్ష్మి. "మనల్ని ఎలానో కాపాడాలి. కరువురోజులాయె! కటాక్షించాలి..." ఈ రకమైన పదాలతో భజన మొదలెట్టింది. లోలోపల చంకలు గుద్దుకున్నాడు యిన్స్పెక్టరు. భోజనాలయేయి. చుట్ట కాలుస్తూ దర్జాగా కూర్చున్నాడు కుర్చీలో. తనభార్య యింకా అతన్ని అనూయకంగా బ్రతిమాలుతూనే వుంది.

"ఏదో చూస్తా" నంటూ తనకూ లక్ష్మికీ మధ్యనుంచి పొగ వదలడం మొదలెట్టేడు. ఔను! వదులుతాడు ...తననూ లక్ష్మినీ వేరుచేసి ఆమెను చేరదీసుకోనేటందుకు ఎన్ని మబ్బుతెరలనయినా తమిద్దరిమధ్యా సృష్టిస్తా డా పాపి! ...

రామేశంలో ఉద్రేకం హెచ్చయింది. ఓ వేడి నిట్టూర్పు విడిచేడు! అంతే!

అయితే లక్ష్మినీ, తననూ వేరుచేసినది ఆ యినస్పెక్టరా?...మరి లక్ష్మి యినస్పెక్టరింటి కెళ్ళడంలోగల వుద్దేశ్యం?...

...తనఉద్యోగం పోతుందో ఏమోనన్న భయం చేత, ఆ తరువాత ఎలా బ్రతకగలమనే అధైర్యంచేత, తన ఉద్యోగం నిలబెట్టేటందుకని ఇనస్పెక్టరుని బ్రతిమాలేటందుకు అక్కడికి వెళ్ళిందా?...అయితే తనతో ఆ విషయం ఎంచేత చెప్పలేదు?...అన్నట్లు తనను అడిగింది. "ఇనస్పెక్టరు దగ్గరకు వెళ్ళండి బ్రతిమాలండి. అవసరమైతే లంచం యివ్వండి నా కాసు యిస్తాను" అని అంది. ఆ మాటలు తను లెక్క చెయ్యలేదు. ఆ వుద్యోగంపోతే మరోవిధంగా నైనా బ్రతకవచ్చుననే ధైర్యం తనది. మరి లక్ష్మికా ధైర్యం లేకపోయింది కాబోలు!...తనతో చెబితే ఎలానూ వెళ్ళనివ్వననే భయంవల్ల, తనతో చెప్పకుండానే అతన్ని బ్రతిమాలుకుందికి వెళ్ళిందేమో!...కానీ లోకం యిలాంటి వివరీతపు అలజడిని లేవదీస్తుందని అప్పట్లో ఆ అమాయిక యెరుగుండదు!...

అయితే లక్ష్మి వట్టి అమాయికా?...ఆమెను అనుమానించడం తన తప్పేనా?

మరి ఆలోచించడానికి రామేశంలో శక్తిలేకపోయింది. ఏదో భయం అతని హృదయానికి కవచమైంది!..."లక్ష్మి అలాంటి చెడుప్రవర్తనకలది కాదు. ఆరోజువరకూ నీ మీద

అంత ప్రేమగలదీ, ఆ ముసలితొక్కు అయిన ఇనస్పెక్టరుని చూడ్డంతోనే అతన్ని ప్రేమించిందని ఎలా అనుకున్నావు మూర్ఖుడా?" అని యెవరో తనమనస్సుని తట్టి లేపినట్టయుంది.

అంతట్లో అతని రెండేళ్ళకొడుకు రాము జ్ఞాపకం వచ్చేడు. అసలే బల్లజబ్బుతో ఉన్నాడు. ఎప్పుడూ తనని విడిచిఉండలేదువాడు. పాపం వెక్కి వెక్కి యేడుస్తూవుంటాడు. "నాన్న ఏరీ" అంటూ తల్లి రొమ్ముని అంటిపెట్టుకుని ఆమెకి మరింతదుఃఖం కలిగేలా అడుగుతూవుంటాడు కాబోలు! పాపం లక్ష్మి హృదయం ఎంతలా గడ్డకట్టుకుపోయిందో? అసలింతకీ యీ అపవాదునీ, తను వచ్చేయడంవల్ల కలిగిన దుఃఖాన్నీ ఎలా భరించగలుగుతుందో?... రామేశం మరి కూర్చోలేకపోయాడు. లేచి నిలబడ్డాడు. అంతట్లోనే చిరిగిన గాలిపటం పట్టుకొని యిందాకటివ్యక్తి వస్తున్నాడు.

"ఏమోయ్!... ఇక్కడికి బస్సుస్టాండు ఎంతదూరం?" అని ప్రశ్నించాడు ఆత్రంగా రామేశం.

"అబ్బ! నా గాలిపటం అసలే చిరిగిపోయింది. వాళ్ళంతా కలిసి చింపేస్తేనేగాని ఉండలేకపోయారు. నా చెయ్యిపట్టుకొని ఆ ఉన్నదికాస్తా మీరు చిరుగు అంటించుకునేందుకైనా వీల్లేకుండా చింపేసేలాగున్నారు. ఆ యెదురుగా కనిపిస్తున్న రోడ్డంట పొండి. బస్సుస్టాండు అగుపిస్తుంది" అన్నాడా వ్యక్తి సగంచిరాకుతో.

ఆ రోడ్డంట పోతూవుంటే మళ్ళీ మొదట కనిపించిన

జట్కా వాడు మళ్ళా కనిపించి "బాబయ్యా! జట్కా ఎక్కుతా కేంటి?...ఇందా కెందు కెల్ల లేదంటే, ఎర్రగొడుగుని చూసింది బాబయ్యా! ఎర్రగొడుగునిసూస్తే అడుగు ముందు కెయ్యదని ఈ గుర్రాన్ని నా కమ్మినోడు యిప్పాడే కలిసి సెప్పేడు" అన్నాడు తన గుర్రం మచిందేనని సమర్థించుకుంటూ.

జట్కా యెక్కి కూర్చున్నాడు రామేశం.

◆ ◆ ◆

ఇంటిదగ్గిర పరిస్థితి చూసేసరికి గామేశం హృదయం గడ్డకట్టుకుపోయింది! అతనినోటంట మాటరాలేదు...అనుకున్నంతపని అయింది. కానీ తన అదృష్టం బాగుండబట్టి ఆమెలోంచి జీవు డింకా అదృశ్యం కాలేదు.

అదివరకు ఆమెపట్ల ఎంతోకఠినంగా ప్రవర్తించిన లోకం, తప్పెవరిదో తెలుసుకొని ఆమెపట్ల సానుభూతిని చూపింది. కొన్నివిషయాలలో లోకులు కఠినతను చూపినప్పటికీ, వాళ్ళహృదయాలలో ఏ మూలనో వాత్సల్యము, కరుణ, సానుభూతి అనేవి వాళ్ళకి తెలియకుండానే భద్రపరుపబడిఉంటాయి!...ఆ మూడూ లేనివ్యక్తి మానవుడే కాడు. అలాంటివాడి కీ సంఘంలో తావేలేదు!...

భరించశక్యంకాని దుఃఖంచేత, లక్ష్మి పిల్లడితో సహా నూతిలోకి దూకింది. లోకుల గుండెల్లో 'గుభేలు'మని శబ్దం...కరుణారసం వాళ్ళను ఊపింది. ఆమెను రక్షించారు. ప్రాణాలకు అట్టే ప్రమాదంలేదు కాని గాయాలుమాత్రం తగిలేయి.

అప్పుడు లోకులు నిజాన్ని తెలుసుకున్నారు. - ఇన స్పెక్టరు వట్టిపోకిరీ వెధవనీ; ఆమెని చూసినదగ్గరనుంచీ, ఆమెమీద భ్రాంతికలిగిందనీ; ఆమెనెలాగైనా వశంచేసుకునే మార్గం కనిపెట్టమని విశ్వనాధం మేష్టారితో చెప్పినట్టూ; (విశ్వనాధం, రామేశం కోటీచర్సు) రికార్డులలోగల లోపాలను ఏరి ఉద్యోగం పోతుందని భయపెట్టమని విశ్వనాధం ఇన్‌స్పెక్టరుకి సలహా యిచ్చినట్టూ; పైగా తన భార్య కామమ్మను మధ్యవర్తిగా వినియోగించి లక్ష్మిదగ్గరికి పంపి, 'నీ భర్త ఉద్యోగం పోతుంది. నువ్వే స్వయంగా వెళ్ళి బ్రతిమాలు. ఇదివరకు ఓమారు యిలానే అయితే నేనే స్వయంగా వెళ్ళి బ్రతిమాలి మా ఆయన ఉద్యోగం కాపాడేను.' అని ఆమెచేత చెప్పించి లక్ష్మిని మరింత పురికొల్పినట్టూ, తన భర్త ఉద్యోగం పోతుందేమోనన్న భయంచేతే లక్ష్మి ఇనస్పెక్టరుదగ్గరకు వెళ్ళిందనీ లోకం గ్రహించింది.

విశ్వనాధాన్నీ, ఇనస్పెక్టరినీ, తన్నడానికి ఆ ఊరు వాళ్ళు నిశ్చయించేరు. కానిరామేశం వాళ్ళని వారించేడు.

"ఏపనిచేసినా మనలాంటి బీదవాళ్ళకేగానీ, వాళ్ళకేమీ యిబ్బందులురావు" అని అన్నాడు కన్నీరు తుడుచుకుంటూ —

శరీరం అంతాకట్లతో, డ్రెస్ చెయ్యబడివున్న కొడుకువేపూ, భార్యవేపూ వెర్రిగాచూడ్డం తప్ప మరేమీ చెయ్యలేకపోయాడు రామేశం!

"నన్ను మరి నువ్వు క్షమించవుకదూ?" అన్నాడు లక్ష్మికళ్ళలోకి దీనంగాచూస్తూ.

"మీ ...తప్పేముంది?" అని ఆయాసంతో అంది.

"అంతా నాతప్పేను లక్ష్మీ!" అన్నాడు రామేశం చిన్నపిల్లాడిలా యేడుస్తూ.

"అదిగో... అదేవద్దు. అంతామరచిపోయి నా వేపు చూసి నవ్వరూ?"

ఆ పాలిపోయిన లక్ష్మిముఖంలో అగుపడుతున్న నవ్వునుచూసేడు. లేనినవ్వును తెచ్చుకొని తనూ నవ్వేడు. మళ్ళీ కొడుకు వేపు చూసి కన్నీరుకార్చేడు.

* * *

"లక్ష్మీ! ఇక మనం స్వతంత్రులం. నా ఉద్యోగం పోయింది. ఇదిగో ఆర్డరు!" అన్నాడు రామేశం.

"ఉద్యోగం పోతుందని నాకు తెలుసు. ఆవేళ యిన స్పెక్టరు నామీద చెయ్యివెయ్యబోయేసరికి ఉండబట్టలేక అక్కడున్న రూళ్ళకర్రతో వాడిబుర్రమీద గట్టిగాకొట్టి పారిపోయివచ్చేను. అప్పుడే అనుకున్నాను మీ ఉద్యోగం పోతుందని!...తీరా యింటికొచ్చేసరి కిదంతా..." అని రామాన్ని ఠొమ్ముకద్దుకుంటూ కళ్ళంట నీళ్ళు కార్చింది లక్ష్మి.

"లక్ష్మీ! ఇక గతవిషయాలన్నీ మరిచిపో! మన రామాన్ని చూసుకుంటూ హాయిగా కాలక్షేపం చేద్దాం" అన్నాడు రామేశం.

ఉద్యోగం పోయినతరువాత, ఇంకా ఎలా హాయిగా కాలక్షేపం చెయ్యడమా అనేదే లక్ష్మిని పీడిస్తున్న సమస్య. ఈ సమస్య రామేశాన్నికూడా పీడించకపోలేదు!!...